క్లుప్తంగా

విజయఢంకా మోగించడం ఖాయం



మాట్లాడుతున్న మల్లి నిర్మల

నెల్లూరు(దర్గామిట్ట): 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా పోషించడం ఖాయమని ఆ పార్టీ మహిళా నాయకురాలు మల్లి నిర్మల అన్నారు. గురువారం నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీ నేత బీద రవిచంద్రతోపాటు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిసేందుకు వెళితే కనీసం కలిసే అవకాశం ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ వేమిరెడ్డికి ఎంతో ప్రధాన్యం ఇచ్చిందని గుర్తుచేశారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీకి ఎందుకు రాజీనామా చేశారో స్పష్టత ఇవ్వాలని, బడుగు బలహీన వర్గాలకు టిక్కెట్ ఇవ్వడం ఆయన ఇష్టం లేదా అని ప్రశ్నించారు. టీడీపీ సంబరాలు ఎందుకు చేస్తుందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో సరిత, అరవ ప్రమీల పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మేయర్ స్రవంతి, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్‌లను కోరారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్‌లను వారి చాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా అందుకు వారు సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సర్వేపల్లి కాలువపై నిర్మించిన బ్రిడ్జికి సంబంధించి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. స్వర్ణకారులకు సంబంధించిన కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఖాళీ చేయించాలన్నారు.

నేటి నుంచి అష్టలక్ష్మి యాగం



నెల్లూరు(బృందావనం): లోక కల్యాణార్థం నగరంలోని వీఆర్సీ మైదానంలో ఈ నెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు అష్టలక్ష్మి యాగం నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా అనకాపల్లి మండలం కొండకొప్పాకకు చెందిన శ్రీఅష్టలక్ష్మీ పీఠం అధిపతి పీతాంబరం రఘునాథాచార్య తెలిపారు. ఈ యాగానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం వీఆర్సీ మైదానంలో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునాథాచార్య మాట్లాడుతూ ఇప్పటికే గత నాలుగు రోజులుగా పెరుమాళ్ శోభాయాత్ర, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ముకుందమాల పారాయణం, అంకురార్పణ మహోత్సవం నిర్వహించామన్నారు. శుక్రవారం అగ్నిప్రతిష్ఠ, లక్ష కుంకుమార్చన, ఆరాధన, అభిషేకం, హోమాలు, భజనలు, కీర్తనలు, ప్రవచనాలు, పూర్ణాహుతి, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యాగ నిర్వహణకు సహకారం అందించిన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పాలకమండలి చైర్మన్ శ్రీరాంసురేష్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. సకల జనులు యాగంలో పాల్గొని అమ్మవారి కటాక్షం పొందాలన్నారు. సమావేశంలో అద్దంకి రంగనాథస్వామి, నున్నా వెంకటబలరామ కృష్ణమాచార్యులు, రంగనాథ్, రమేష్, హరికృష్ణ, రాచూరి లక్ష్మయ్య దంపతులు, యాగ నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

కొడవలూరు : పంట నమోదు పూర్తయిన రైతులు వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలిక ఆర్బీకేలను ఆమె గురువారం సందర్శించి పంట నమోదు, ఈ-కేవైసీలను పరిశీలించారు. పంట నమోదైన రైతుల్లో పలువురు ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. ఇది కూడా పూర్తయితేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని చెప్పారు. ఈ-కేవైసీని ఫోన్‌లో ఓటీపీ ద్వారా లేదా వేలిముద్ర ద్వారా చేయించుకునే వెసులుబాటు ఉందన్నారు. రైతులకు సులభమైన పద్ధతిలో ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట వీఏఏలు సుజిత్, నవీన్, రైతులు ఉన్నారు.

ప్రగతి పథంలో ములుముడి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామానికి మహర్దశ
- రూ.28.77 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు
- డీబీటీ ద్వారా రూ.18,58,50,437 లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా రూ.5,79,01,128 ప్రయోజనం
- మౌలిక వసతుల కల్పనకు రూ.4.40 కోట్లు

నెల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతోంది. ఓ వైపు సంక్షేమ పథకాల ద్వారా అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూనే.. మరోవైపు కోట్లాది రూపాయల నిధులతో పల్లెలు, పట్టణాలు, నగరాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా పథకాలకు సంబంధించిన నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతోంది. తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. అలాగే గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పల్లెలు ప్రగతి పథకంలో పయనిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటర్ వ్యవస్థలు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఎంతో దోహదం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయి. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

అభివృద్ధి బాట

నెల్లూరు రూరల్ నియోజకవర్గం రూరల్ మండలంలోని ములుముడి గ్రామం గతంలో సమస్యలు, వర్గ రాజకీయాలు, కక్షలు, కార్పణ్యాలకు నిలయమై తరచూ ఇరువర్గాల వారు దాడులు చేసుకోవడంతోపాటు హత్యల వరకు వెళ్లి సందర్భాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ ఫిరాయించిన నేపథ్యంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టడంతో ఈ గ్రామం ప్రగతి పథంలో ముందుకుసాగుతోంది. గత టీడీపీ పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామంలో ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని వందలాది మందికి లబ్ధి చేకూరి ఎంతో సంతోషంగా జీవిస్తున్నారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, రైతు భరోసా, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, పొదుపు మహిళలకు సున్నావడ్డీ, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసరా, హౌసింగ్, వైఎస్సార్ బీమా, వాహనమిత్ర, చేదోడు, నేతన్న నేస్తం, రైతులకు సున్నా వడ్డీ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, కల్యాణమస్తు, కాపునేస్తం తదితర సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయల ప్రయోజనం చేకూరింది. జగనన్న కాలనీల్లో 81 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందాయి. 261 మందికి ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేసింది. మొత్తమ్మీద డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఈ గ్రామానికి, ప్రజలకు రూ.24,37,51,565 లబ్ధి చేకూరింది.



ములుముడి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు



శరవేగంగా జరుగుతున్న డ్రెయిన్ల పనులు

రూ.4.40 కోట్లతో మౌలిక వసతులు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ములుముడి గ్రామంలో రూ.4.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు మౌలిక వసతుల కల్పించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.1.05 కోట్లతో మౌలిక వసతులు కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.24.75 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన అత్యవసర పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.40 లక్షలు వెచ్చించింది. అలాగే గ్రామంలో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించింది. అంతేకాకుండా గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.2.30 కోట్లు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టించింది. ఈ నేపథ్యంలో ఎలాంటి సిఫార్సులు, రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారం చేపట్టాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి ప్రజలకు సుపరిపాలన అందించాలని ములుముడి గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

గత నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు పొందిన ప్రయోజనం

సంక్షేమ పథకం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన లబ్ధి
అమ్మ ఒడి	399	రూ.1,78,64,446
జగనన్న విద్యాదీవెన	286	రూ.1,06,60,679
రైతు భరోసా	367	రూ.1,74,42,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	755	రూ.7,33,76,000
వైఎస్సార్ చేయూత	347	రూ.1,45,68,750
ఆసరా	751	రూ.2,20,84,001
పొదుపు మహిళలకు సున్నావడ్డీ	947	రూ.38,69,831
ఈబీసీ నేస్తం	25	రూ.6,60,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	187	రూ.96,86,819
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసరా	104	రూ.7,00,550
హౌసింగ్	6	రూ.5,42,994
వైఎస్సార్ బీమా	12	రూ.27,00,550
వాహనమిత్ర	63	రూ.19,50,0000
చేదోడు	29	రూ.6,90,000
నేతన్న నేస్తం	44	రూ.38,40,000

సొంతింటి కల నేరవేరుతోంది



మా గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరగడం ఎంతో సంతోషంగా ఉంది. నాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో సొంతింటి కల నెరవేరుతుంది. జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి.
– శిరీష, స్థానికురాలు

గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది



ములుముడి గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. మా ఊర్లో ప్రభుత్వం సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మించడంతోపాటు పలు అభివృద్ధి పనులను చేపట్టింది. సచివాలయ నిర్మాణం జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నివర్గాల వారికి అండగా నిలుస్తోంది.
– పి.కల్పన, స్థానికురాలు

ఓ వైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి



నెల్లూరు రూరల్ మండలంలోని గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతోంది. అలాగే ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారానికి సకాలంలో నిధులు మంజూరు చేయడం ద్వారా సుపరిపాలన సాధ్యమవుతోంది. – శైలేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, నెల్లూరు రూరల్

ఎన్నికల సంఘం విధివిధానాలను పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

- కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలు, ఆదేశాలను ఎన్నికల విభాగాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని నెల్లూరు సిటీ–117 అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్ఓ/కమిషనర్ వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా నెల్లూరులోని నగరపాలక సంస్థ ప్రాంగణం కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఉన్న సమావేశ మందిరంలో గురువారం ఒకటి నుంచి 248 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్ల సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్వీఈఈపీ) కార్యక్రమంలో భాగంగా ఎన్నికల నిర్వహణపై సమగ్ర శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రి రవాణా, సరఫరా, ఈవీఎం మెషీన్ల ఏర్పాటు, నిర్వహణ, పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, తర్వాత రోజు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్స్ ట్రైనర్స్ అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరు కాని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన 17 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకట్రావు, శ్రీకాంత్, నరసింహప్రసాద్, వెంకటరమణ, ప్రసాద్, వేణు, ప్రకాష్ అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించారు.



శిక్షణ తరగతులకు హాజరైన సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు

సంక్షేమానికి ఓటు వేయండి

నెల్లూరు(బారకాసు): సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ఏపీ స్టేట్ ఎమ్మెస్‌ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్ పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 17వ డివిజన్‌లో నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్, ముఖ్య నాయకులతో కలిసి ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం కృషి చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు డివిజన్ పరిధిలోని ఆకుతోట ప్రాంతంలో ఉన్న శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో స్థానిక ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుడు పాముల రమణయ్య, ఇతర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పాశం శ్రీనివాస్ తదితరులు

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం

సంక్షేమ పాలన కోసం మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ 20వ డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరి సురేష్‌బాబు కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పద్మజ యాదవ్, సరళమ్మ, గోపాల్‌రెడ్డి, రామ్మోహన్, రసూల్, దిలీప్, ఏడుకొండలు, రాజా, కళ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

నెల్లూరు(బృందావనం): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రెడ్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న హోటల్ సీజన్స్ ఇన్‌లో ఘనంగా నిర్వహించారు. రెడ్ల ఐక్యవేదిక నేత నిర్మల నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆంగ్లేయులపై ఆయన సాగించిన పోరాటాన్ని, ధైర్యసాహసాలను వక్తలు కొనియాడారు. మార్చి 3వ తేదీన ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో జరగనున్న రెడ్ల ఐక్య వేదిక సమావేశంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న మెడికల్, బ్లడ్ క్యాంప్‌లతోపాటు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు, న్యూట్రిషన్ చెకప్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీవీ రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఐక్యవేదిక శాశ్వత సభ్యులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న రెడ్ల ఐక్య వేదిక నాయకులు

నేడు కాకుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

నెల్లూరురూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురువారం అధికారులు తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు.

ముస్లింలు రాజకీయంగా అభివృద్ధి చెందకూడదా

- వేమిరెడ్డిపై మండిపడిన ముస్లింలు



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముస్లింలు రాజకీయంగా అభివృద్ధి చెందకూడదా అని ముస్లిం నాయకులు ప్రశ్నించారు. నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుసేనీ, నాయకులు ఆసిఫ్‌పాషా, షేక్ సిద్ధిఖ్, మౌలానా అజీజ్, జియాఉల్‌హక్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో ఎండీ ఖలీల్ అహ్మద్ పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని, ముస్లిం వ్యక్తికి సీటు ఇస్తే వేమిరెడ్డి ఆక్రోశం వెళ్లగక్కడం సరికాదని అన్నారు. జగనన్న ఇచ్చిన పదవిని అనుభవించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ముస్లింలపై అంత వివక్షత ఎందుకని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని ఎందుకు ధిక్కరిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేటర్ షేక్ కరీముల్లా, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోవూరు : మండలంలోని పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం ఉదయం పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా మండలాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రామాంజనేయులు, ఎలక్షన్ డీటీ మధుసూదన్‌రావు, ఆర్ఐ రమణయ్య, ఎంఈఓ రహీమ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండాలి



మనుబోలు : ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ముందుకు సాగాలని ఆ సంఘ మండలాధ్యక్షుడు కృష్ణచైతన్య అన్నారు. మనుబోలు మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా నేత అమర్తలూరు చెంచయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ఏకమై తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. ఈనెల 25న పొదలకూరులో ఆర్యవైశ్య సంఘ సమావేశం జరుగుతుందని తెలిపారు. అందులో నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సంఘ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘ సభ్యులు ఓలేటి సురేష్, కామిశెట్టి భార్గవ్, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

3న మాదిగల రాజకీయ గర్జన

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ మన ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీన నిర్వహిస్తున్న మాదిగల రాజకీయ గర్జన జయప్రదం చేయాలని మన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు మాదిగ పిలుపునిచ్చారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదిగల రాజకీయ గర్జన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన, రాజకీయ ప్రాధాన్యం కోసం నెల్లూరు కొండాయపాళెం గేటు సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే మాదిగల రాజకీయ గర్జన సభకు జిల్లా నలుమూలల నుంచి మాదిగ సంఘీయులు, ఉద్యోగ సంఘాల నేతలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం, మన ఎంఆర్‌పీఎస్ లీగల్ అడ్వయిజర్ శ్రీరాం మురళీకృష్ణ, మహిళా అధ్యక్షురాలు పల్లాల సునీత, రాష్ట్ర సలహాదారు సగిలి గురవయ్య, మార్పు సంస్థ అధ్యక్షుడు చిగురుపాటి పవన్, సుబ్రహ్మణ్యం, దామోదర్, రవి, తాళ్లూరి పృథ్వి, వెంకటేష్, నారాయణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు తదితరులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు ఆధ్వర్యంలో స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ప్రారంభించి 30 సంవత్సరాలు అయిందని, ఆరంభం నుంచి పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీఏ రామారావు మాట్లాడుతూ నగరంలోని యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసిన బాసం శేషగిరిరావు అభినందనీయులమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జీవీ సురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, డిప్యూటీ గవర్నర్ కె.రఘురామ్ ముదిరాజ్, సభ్యులు స్నేహ సురేష్, డాక్టర్ శ్రీనివాస్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బాసం శేషగిరిరావు, వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు

25న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు వాకాటి నరసయ్య శ్రీత్యాగరాజ కల్యాణ మండపం కమిటీ, శ్రీసీతారామ స్వామి మందిర కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం బాలాజీనగర్‌లోని శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో ఆరాధనోత్సవం ఆహ్వాన పత్రికలను కమిటీ కార్యదర్శి అమరా మోహన్‌రావు, ఉపాధ్యక్షులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, ఎం.పి.ఆంజనేయులు, సహాయ కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, సభ్యులు తన్నీరు మస్తాన్‌రావు, స్వామి పూర్ణచంద్రరావు, సంగీత విద్వాంసురాలు లక్ష్మీకామాక్షి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామిని స్మరిస్తూ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక సంగీత కళాకారులచే శ్రీత్యాగరాజస్వామి 'పంచ రత్న కీర్తనల గానం', 4 గంటలకు వయోలిన్ ద్వయం, తదుపరి సింహపురి వీణాత్రయం శిష్య బృందం నాద నీరాజనం, అనంతరం సంగీత గురువులు, శిష్య బృందంతో శ్రీత్యాగరాజ దివ్యనామ సంకీర్తనాలాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. త్యాగరాజస్వామి భక్తులు, సంగీత కళాకారులు, ప్రజలు విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు